# మనసు మరో కోణంలో




ఎం.పద్మ

"నీలూ! పాప ఏడుస్తోంది చూడు" కేక పెట్టాడు శ్యామ్ ముందు గదిలోంచి. ఆ గొంతులో కాస్తంత విసుగు. రవ్వంత కోపం.

సాంబారులో పోపు పెట్టబోతున్నదల్లా ఆ పని ఆపి బెడ్‌రూమ్‌లోనికి నడిచింది నీలిమ. అప్పుడే నిద్ర లేచి పక్క తడిపి చల్లదనానికి ఏడుపు. పక్క తీసి పాపని ముందు గదిలోకి తీసుకుని వచ్చి చాప మీద వదిలి, బొమ్మలు ముందు పెట్టి తిరిగి లోనికి వెళ్లబోతూ భర్త వంక చూసి "అయిదు నిమిషాల్లో వడ్డించేస్తున్నాను కాస్త మేఘనని చూస్తూండండి" అంది నీలిమ.

ఒక్క క్షణం నీలిమ వంక సీరియస్‌గా చూసి టై సర్దుకున్నాడు శ్యామ్. అన్నట్టుగానే అయిదు నిమిషాల్లో వడ్డించి భర్తని పిలిచింది నీలిమ.

హడావిడిగా అన్నం కలుపుతున్న శ్యామ్‌తో "నిదానంగా తినండి సర్. టైమ్ ఉంది" నవ్వుతూ అంటూ ఫాన్ వేసింది నీలిమ. "కూర బాగుందా" ఇంకొంచెం కూర వేయబోతూ అడిగింది నీలిమ.

"వద్దు. నేను ఆఫీసుకి నిద్రపోవటానికి కాదు వెళ్లేది" మళ్లీ సీరియస్‌నెస్. చెంపన చేయి ఆన్చుకుని కళ్లు పెద్దవి చేసి చూస్తుండిపోయింది నీలిమ. ఈ మనిషిని ఎలా మార్చుకోవాలి?

"సాంబారు రాత్రికి వేసుకోనా" శ్యామ్ ప్రశ్నతో ఆలోచన నుండి బయటికి వచ్చి సాంబారు వడ్డించింది. ఒక్క ముద్ద నోట్లో పెట్టుకోగానే ముఖం చిట్లించిన భర్తతో "ఏమయిందండీ" ఖంగారుగా అడిగింది నీలిమ.

"ఉప్పు పాకెట్స్ ఎన్ని కావాలో చెప్పు. సాయంత్రం వస్తూ తెస్తాను" అన్నాడు అదే సీరియస్‌నెస్‌తో. ఒక్క క్షణం నవ్వబోయి ఆగి ఉప్పు వేసింది. పాప ధ్యాసలో చివర్లో వేద్దామనుకుని మరిచిపోయినట్లుంది.

ప్రతి విషయంలో అతని చిరుకోపం ఒక్కోసారి మరీ ముచ్చటగా అనిపిస్తుంది నీలిమకి.

భోజనం ముగించి లేచాడు శ్యామ్. వెనుకే నడిచింది నీలిమ. "ఏమండీ ఒక్క క్షణం" అంటూ మెడ దగ్గర ముడత పడిన కాలర్ సరిచేస్తున్న నీలిమ వంక అలా చూస్తూండిపోయాడు శ్యామ్.

నీలిమ అంత హాయిగా మామూలుగా ఎప్పుడూ తను ఎందుకుండలేడు.. భగవంతుడెంత నిర్దయుడు. అన్నీ అందరికీ ఎందుకివ్వలేదు? ఎందుకంత పక్షపాతం? ఒక్క క్షణం తన ఆలోచనా ధోరణికి తన మీద తనకే కోపం వచ్చింది శ్యామ్‌కి.

"వస్తాను" ఆమె మీద నుండి చూపు తిప్పుకుంటూ మౌనంగా కదిలాడు శ్యామ్.

"బంగారు. తొందరగా వస్తారా!" అతని ఆలోచన గమనించి అడిగింది నీలిమ. ఆ గొంతులో లాలన, ప్రేమ సూటిగా మనసుని తాకుతున్నాయి. మళ్లీ జోక్ చేయబోయినవాడల్లా ఆగిపోయి వెనుదిరిగి చూశాడు సూటిగా ఆమె కళ్లల్లోకి. ఒక్క నిమిషం వెనుకకి వచ్చి ఆమె ఒడిలో సేదతీరాలన్న ఆర్తి, ఆరాటం. కానీ ఉక్రోషం, చిన్నపాటి అహం ఆ పని చేయనివ్వదు. 'ఊ' అంటూనే కారు స్టార్ట్ చేశాడు.

దీర్ఘంగా నిట్టూర్చి లోనికి నడిచింది నీలిమ. మేఘన ఏం చేస్తోందో అనుకుంటూ.

* * *

పనంతా పూర్తి చేసి టైమ్ చూసింది నీలిమ. 11.30 కావస్తోంది. అమ్మతో ఒక్కసారి మాట్లాడితే అనుకుంటూనే ఫోన్ చేసింది.

"అమ్మా! ఎలా ఉన్నావు?" అమ్మతో ఎప్పుడు మాట్లాడినా ఆనందమే. అమ్మే ఆనందం. ఆనందమే అమ్మ.

"పాప ఎలా ఉంది!" అమ్మ ప్రశ్న. అమ్మకీ ప్రాణమైన తనని వదిలి, తనకి ప్రాణమైన పాప గురించి అమ్మ అడగటం ఎప్పుడూ ఆనందమే నీలిమకి.

"బాగుందమ్మా!" ఆడుకుంటున్న మేఘన వంకే చూస్తూ మురిపెంగా అంది. హఠాత్తుగా గుర్తు వచ్చినట్లుగా, "నువ్వు కూడా ఇంకా పాప అంటావేమిటమ్మా! మేఘన అని మంచి పేరుండగా" అంది ఉక్రోషంగా.

"ఓ... అదా!" నవ్వింది అన్నపూర్ణ.

"నాన్న ఎలా ఉన్నారు" నీలిమ ప్రశ్న.

"బాగున్నారు. అబ్బాయి ఆఫీసుకి వెళ్లాడా!" అమ్మ ఎప్పుడూ శ్యామ్‌ని అబ్బాయి అనే అంటుంది.

"లేదమ్మా! అల్లరి చేస్తుంటే భరించలేక బీరువాలో కూర్చోబెట్టి లాక్ చేశాను" అంది సీరియస్‌గా నీలిమ.

ఒక్క క్షణం అర్థంగాక తర్వాత ఫక్కున నవ్వింది అన్నపూర్ణ.

"నీ చిలిపితనం పోలేదే నీలూ!" ఇంకా నవ్వుతూనే అంది అన్నపూర్ణ. వారం రోజుల్లో పాప పుట్టినరోజు కదా! ఏమయినా అనుకున్నారా!"

అమ్మ మాటలకి "లేదమ్మా! ఈ రోజు ఆయనకి గుర్తుచేస్తాను" అంది పరధ్యాసగా నీలిమ. ఇంతవరకూ తనే ఆలోచించలేదు. పెద్దవాళ్లకు అన్నీ గుర్తే అనుకుంది.


"సరే అమ్మా! ఉండనా! నేను మళ్లీ మాట్లాడతాను" అంటూనే ఫోన్ పెట్టింది నీలిమ.

* * *

పుట్టినరోజు విషయం శ్యామ్ ఏమంటాడో అని ఆలోచన నీలిమకి. పెళ్లయి నాలుగేళ్లవుతున్నా అతని మనసు కొంత తికమకగానే అనిపిస్తుంది నీలిమకి.

ఎక్కువగా మాట్లాడడు కానీ మాట్లాడే కొద్ది మాటలు సరదాగా ఉంటాయి. ప్రేమతో నిండి ఉంటాయి. అతని ప్రేమ మాటల్లో కన్నా చేతల్లో ఉంటుంది ఎక్కువగా. ఏ భావాన్ని బయటకి వ్యక్తం చేయడు. మనసు మాత్రం చాలా సున్నితం. చిన్నప్పుడే అతని తల్లి చనిపోవడంతో తండ్రి శ్యామ్ కోసం రెండో పెళ్లి చేసుకున్నాడు. సవతి తల్లి సరిగా చూడకపోవడం, తన కొడుకుని బాగా చూసుకోవడంతో శ్యామ్ ఒంటరివాడయ్యాడు. దానికి తోడు తల్లికి భయపడి తండ్రి సరిగా పట్టించుకోకపోవడం. అన్నీ చాలా చోట్ల జరిగే విషయాలే. అయినా శ్యామ్ విషయంలో మరొకటి. అతని నలుపు ఛాయని తల్లి ఎత్తిచూపడం. అందువలనే అతనిని సరిగా తాను చూడడం లేదని అనుమానం కలిగేలా ఆవిడ ప్రవర్తన. అన్నీ కలసి అతని పసి హృదయంలో ఒక కాంప్లెక్స్‌ని క్రియేట్ చేశాయి. ఉన్నతమైన చదువు, సంస్కారం, మంచి ఉద్యోగం అతనిలోని ఆ కాంప్లెక్స్‌ని దాచేసినా అంతర్లీనంగా ఉన్న చిన్నప్పటి అసహనం, అసంతృప్తి నలుగురిలో పూర్తిగా కలవనీయకుండా చేశాయి.

ఇవన్నీ తెలిసినా నీలిమ మనస్ఫూర్తిగా అతన్ని ఇష్టపడి చేసుకుంది. కారణం నీలిమకి చిన్నప్పటి నుంచి బాబాయి ప్రభావం కొంత. బాబాయి వాళ్లున్న ఇంటి పక్కనే శ్యామ్ వాళ్లుండేవాళ్లు. శ్యామ్‌ని చిన్నప్పటి నుండి బాబాయి గమనిస్తుండటంతో అతని మీద బాబాయికి మంచి అభిప్రాయం. అంతే కాకుండా



నీలిమ ఒక్కతే కూతురయినా డబ్బులో పెరిగినా వేటి మీదా పెద్దగా వ్యామోహం కానీ, ఆసక్తి కానీ లేదు. మనిషి కంటే మనసుకి ప్రాధాన్యతనివ్వాలి అనిపిస్తుంది నీలిమకి.

బాబాయి ఈ సంబంధం వివరాలు చెప్తూ 'నీలూ! రంగు గురించి నీకు అభ్యంతరం లేకపోతే తప్ప అతన్ని వదులుకోవడం నాకిష్టం లేదు. అతని గురించి నీకు అంతా చెప్పాను. తుది నిర్ణయం మాత్రం నీదే. ఎందుకంటే జీవితంలో ఎప్పుడూ పొరబాటు చేశాను అని నీకు అనిపించకూడదు. నీ నిర్ణయం ఏదయినా నాకానందమే. బాబాయి ఏమనుకుంటాడో అని ఆలోచించకు. ఎందుకంటే ఇది నీ జీవితానికి సంబంధించిన విషయం అని చాలా సున్నితంగా చెప్పాడు.

★ ★ ★

మొట్టమొదటిసారి అతన్ని చూసినప్పుడు అతని కళ్లలో సంస్కారం, అమాయకత్వం చాలా నచ్చాయి నీలిమకి. మనస్ఫూర్తిగా అంగీకరించింది నీలిమ. అందుకే తల్లి, తండ్రికి మిగిలిన విషయాల్లో కొంత అసంతృప్తి ఉన్నా నీలిమ కోసం ఒప్పుకున్నారు.

పెళ్లి కాగానే వేరుగా వెళ్లమనే శ్యామ్ సవతి తల్లి కోరిక ప్రకారమే విడిగా వచ్చేశారు. అదే సమయంలో అతని తమ్ముడికి వేరే ఊర్లో ఉద్యోగం కూడా రావదంతో తల్లిదండ్రుల్ని తీసుకెళ్లిపోయాడు.

నీలిమకు కలవాలని ఉన్నా వాళ్లు కలవనివ్వరు. ఎప్పుడైనా ఫోన్‌లో మాటలే తప్ప కమ్యూనికేషన్స్ లేవు. వెళ్లేముందు శ్యామ్ తండ్రి మాత్రం "అబ్బాయి జాగ్రత్తమ్మా!" తల మీద చెయ్యి వేసి చెప్పటం తలుచుకుంటే బాధగా అనిపిస్తుంది నీలిమకి. ఆయన కళ్లల్లో తడి. మమకారం, ప్రేమ ఎక్కడికి పోతాయి అనిపించింది.

★ ★ ★

శ్యామ్ చాలారోజులు పిల్లలు వద్దు అంటే తను అంత సీరియస్‌గా తీసుకోలేదు. కానీ తర్వాత తనే ఒక సందర్భంలో అన్నాడు. పిల్లలకు తన రంగు వస్తే అని. అమాయకమైన ఆ సందేహానికి నవ్వొచ్చింది నీలిమకి. ఎంతో నచ్చచెప్పి అతన్ని కన్విన్స్ చేసింది.

పిల్లలు వద్దనటానికి అదొక్కటే కారణం కాదని తర్వాత తెలిసింది నీలిమకి.

పాప పుట్టాక ఒక్కోసారి అతని పనుల్లో కొంచెం ఆలస్యం జరిగేది. ఒక్కోసారి మర్చిపోవటం, ఆ సందర్భంలోనే అతని అసంతృప్తి ఒకసారి బయటపెట్టాడు.

"అందుకే పిల్లలు వద్దన్నాను. నువ్వు వినలేదు" ఒక్క నిమిషం అర్థంకాని అయోమయం నీలిమకి.

తర్వాత ఎన్నడూ అతనిలో ఆ అసంతృప్తి రాకుండా జాగ్రత్త పడింది. ఆ జాగ్రత్తలే అతను అన్న మాటకి బాధపడేలా చేశాయి. వారం రోజుల తర్వాత అతనే అన్నాడు. గొంతులో గిల్టీనెస్ "నీలూ! నీ ప్రేమ నాకే సొంతం. ఇంకెవరి షేరింగ్ నేను భరించలేను. చిన్నప్పుడు నేను కోల్పోయిన తల్లిప్రేమ కూడా నీలో చూస్తున్నాను. స్త్రీకి ఎన్నో కోణాల్లో ప్రేమ ఉంటుందని అంటారు. నిన్ను మొదట చూసినప్పుడే నీ కళ్లల్లో ప్రశాంతత నాకు నచ్చింది. నన్ను చూడగానే ఏ విధమైన మార్పు లేని నీ సంస్కారం నచ్చింది. అవి తెచ్చిపెట్టుకున్నవి కావని నా నమ్మకం. పెళ్లి గురించి, భార్య గురించి నేనెప్పుడూ పెద్దగా ఊహించుకోలేదు. కానీ నిన్ను చూశాక ఇలాంటి స్త్రీ నాకు భార్యగా కావాలి అనే భావం కలిగింది. నీ ప్రేమ కొంచెం తగ్గినా నేను భరించలేను. పిల్లలు పుడితే ఆడవాళ్లు భర్తని పట్టించుకోరు అంటారు. అందుకే పిల్లలు వద్దని జాప్యం చేశాను. అది నా స్వార్థం. కానీ నీ విషయంలో నా ప్రవర్తన చాలా సందర్భాలలో మార్చుకోవాలనిపిస్తుంది. అనడం కంటే నీ సహనం, ప్రేమ మార్చుకునేలా చేశాయి అని చెప్పాలి. ఒక భర్త భార్యతో ఇలా చెప్పగలగటం ఆ ప్రేమ మీద ఉన్న అపారమైన నమ్మకంతోనే.

ఎదుటి వ్యక్తి బలహీనతలను కూడా అర్థం చేసుకుని గౌరవించే మనసు నీకుందనే నా మనసు నీ ముందు పెడుతున్నాను. నీలూ! ఓ మాట అడగనా! నన్ను ఇప్పుడు కూడా ప్రేమగా చూస్తావు కదూ!" చివరి మాటల్లో అతని గొంతులో కాస్త తడబాటు. నీలిమలో ఆశ్చర్యం, ఆనందం.

తన భర్త ఇన్ని మాటలు, అదీ భార్య దగ్గర చెప్పని చెప్పలేని తన బలహీనతలు చెప్పటం.

అతనికి తనంటే ఇష్టమని తెలుసు. కానీ ప్రాణం అని తెలిశాక, అతనేమిటో చాలా అర్థమయ్యాక చిన్న పిల్లాడిలా అతన్ని దగ్గరికి తీసుకుంది నీలిమ. ఈ సంతృప్తి చాలు అనిపించే పరిపూర్ణమైన తృప్తి భార్యలో భర్త ముగ్ధత్వాన్ని కోరుకుంటే, భర్తలో భార్య ప్రేమ వ్యక్తం చేసే ఇలాంటి మాటల్ని ఇష్టపడుతుందేమో!

★ ★ ★

మేఘన ఏడుపుతో ఆలోచనల నుండి బయటకి వచ్చింది నీలిమ. లేచి నించోబోయి పడింది. మేఘనని దగ్గరికి తీసుకుని ముద్దు పెట్టుకుంది. మేఘన అంతా తండ్రి పోలిక. రంగు చామన ఛాయ. అదే అతని కోపం. అతని అనుమానం నిజమయింది అని.

బారసాల కూడా చాలా సింపుల్‌గా చేశారు అతని ఇష్టప్రకారమే. నీలిమ ఒక్కతే కూతురయినా ఆమె ముచ్చట్లు ఆర్భాటంగా చేయలేకపోతున్నామే అని తల్లిదండ్రుల బాధ. అయినా శ్యామ్ వైపు ఏ మాట రాకుండా జాగ్రత్త పడుతుంది నీలిమ. అతని గౌరవం తగ్గించే విషయాలేవీ తల్లితో చెప్పదు.

ఇప్పుడు పుట్టినరోజు ఏమంటాడో అని నీలిమ ఆలోచన. అందరినీ పిలిచి ఆర్భాటం చేయటం అతనికి నచ్చదు. మొదటి పుట్టినరోజు కదా! వేడుకగా చేయకుండానా! అని అమ్మ అనుకుంటుంది.

సాయంత్రం శ్యామ్ వచ్చేసరికి కొద్దిగా ఆలస్యమైంది. ఎదురు చూస్తూండటంతో ఇంకా ఆలస్యమనిపించింది నీలిమకి. వస్తూనే అలసిపోయి సోఫాలో వాలిపోయాడు శ్యామ్. అతను అలా ఉంటే ఒక్క క్షణం కూడా తోచదు నీలిమకి.

కాఫీ తెచ్చి చేతికిచ్చి పక్కనే కూర్చుని తలమీద చేయి వేసింది నీలిమ. ఒక్క క్షణం ఆ స్పర్శతో సేదతీరుతున్న అనుభూతితో కళ్లు మూసుకున్నాడు శ్యామ్. మేఘన చిట్టి చేతులు తాకుతుంటే కళ్లు తెరిచి చూశాడు. పాప అమాయకపు నవ్వు అలసటని పూర్తిగా మాయం చేసిన భావం కలిగింది.

"మేఘన పుట్టినరోజు వచ్చేవారమే. ఏం చేద్దాం" గుర్తుచేస్తూ అంది నీలిమ.

"నీలూ! ఆలోచిద్దాం. ఆర్భాటం కాదు. ఆనందం నలుగురికీ అందేలా, పంచేలా చేద్దాం. సరేనా. నువు నిశ్చింతగా ఉండు" పాపని తీసుకుని నీలిమ వడిలో తల వాలుస్తూ అన్నాడు. అతనలా అన్నాక ఇంకేమనాలో తెలీక మౌనంగా ఉండిపోయింది నీలిమ.

★ ★ ★

"నీలూ! రేపు ఉదయం మనం బయటకి వెళ్తున్నాం. ఆఫీసుకి శలవు పెట్టాను. మేఘనని రెడీ చెయ్యి పట్టుపరికిణీతో. నీకు తెలుసుగా" పుట్టినరోజు ముందునాడు రాత్రి అతను అన్న మాటలు అవి. అతని ఆలోచనలు తెలియటం లేదు నీలిమకి.

తన సందేహాల్ని మాటలో మార్చేలోపే అతను లోనికి వెళ్లిపోయాడు. అతను చేసే పని ఏదయినా తనకి పరిపూర్ణమైన ఆనందాన్ని అందించేదే. అదీ నీలిమకి అతని మీద ఉన్న నమ్మకం.


★ ★ ★

మరునాడు ఉదయాన్నే శ్యామ్ లేచేలోపే తను రెడీ అయిపోయింది నీలిమ. మేఘనని రెడీ చేస్తుండగా అతను లేచాడు. పావుగంటలో కారులో ఉన్నారు.

"నీలూ! మొదట అమ్మా వాళ్లింటికి వెళ్దాం. తర్వాత గుడికి. తర్వాత నేను చెబుతాను" అన్నాడు శ్యామ్. అతని మాటల్లో ప్రశాంతత నీలూకి నిశ్చింతగా అనిపించింది.

తన తల్లిదండ్రుల్ని సంబోధించేటప్పుడు 'మా' అనకపోవటం నీలూకి ఎప్పుడూ ఆనందంగానే అనిపిస్తుంది. 'మనం' అనుకున్నప్పుడే మాటలు అలా వస్తాయి. నీలూ ఆలోచనలో ఇంటిముందు కారాగడం కూడా గమనించలేదు.

అమ్మ, నాన్న, బాబాయి అప్పటికే తయారయి ఉండటంతో వెంటనే బయల్దేరారు. "నిన్ననే చెప్పాను ఫోన్ చేసి" నీలిమ మనసులో ప్రశ్నకి సమాధానంగా అన్నాడు శ్యామ్. "అబ్బ. ఇలాంటి ప్రణాళిక ఎంత



## నేహా కోరిక!

తనని సెక్సీ తార అనీ, రొమాంటిక్ హీరోయిన్ అనీ జనాలు పిలవడం పెద్దగా ఏమనిపించడంలేదంటోంది 29 ఏళ్ల నేహా ధుపియా. అయితే తన కెరీర్ ప్రస్తుతం సంతృప్తికరంగా వుందని భావిస్తున్న నేహాకి ఓ కోరిక వుందిట. అదేంటంటే- షారుఖ్ ఖాన్‌కి జంటగా నటించాలనిట. అది ఎలాంటి పాత్రయినా కానీ, షారుఖ్‌తో ఒక్క చిత్రంలో అయినా కలిసి నటించాలని వుందని తెగ ఇదైపోతోంది నేహా. మరి ఆమె కోరిక తీర్చే నిర్మాత ఎక్కడున్నాడో? ఎప్పుడొస్తాడో?

హాయిగా ఉంటుంది" అనుకుంది నీలిమ తృప్తిగా.

సంవత్సరం క్రితమే పిన్ని పోవడంతో వెనుకా ముందూ ఎవరూ లేని బాబాయి ఇంచుమించు అమ్మా వాళ్ల దగ్గరే ఉంటున్నాడు. "బాబాయి కూడా వస్తే బాగుండు" అనుకున్న నీలిమకి చెప్పలేని ఆనందం కలిగింది బాబాయిని కూడా అక్కడ చూడగానే.

అమ్మ పాపని చూడగానే చేతుల్లోకి తీసుకుంది. అనుకున్నట్లుగానే ముందుగా గుడిలో అర్చన చేయించాడు శ్యామ్. అమ్మవారికి పాప చేత్తో చీర ఇప్పించారు.

గుడి బయట ఉన్న అన్నార్తులకి కూడా మేఘన చేత్తోనే బ్రెడ్ ఇప్పించాడు శ్యామ్.

"ఇంక బయల్దేరదామా!" అన్న శ్యామ్ మాటలో బాబాయితో మాట్లాడుతున్న నీలిమ కదిలింది.

అరగంటలో కారు అనాథ శరణాలయం ముందు ఆగింది. అదీ ప్రత్యేకంగా వికలాంగుల కోసం ఏర్పాటు చేసిన సంస్థ. ఆవరణలోనికి ప్రవేశిస్తూనే చాలా హాయిగా అనిపించింది నీలిమకి. ఒక్క క్షణం అలా చూస్తూ నిల్చుండిపోయింది. ముందు తోట, అందమైన పూలమొక్కలతో చాలా ఆహ్లాదంగా ఉంది. తర్వాత ఆట స్థలం. పిల్లలు ఆడుకోవటానికి కావల్సిన అన్ని సదుపాయాలతో సౌకర్యంగా ఉంది.

వెనుక అమ్మా వాళ్లు వస్తున్నారని కూడా గమనించకుండానే ముందుకి నడిచింది నీలిమ. కొద్దిగా ముందుకి వెళితే కుడిపక్కగా చిన్న గుడి లోపల వినాయకుడి విగ్రహం. పూజారి అంటూ అక్కడ ఎవరూ లేరు.

అక్కడ ఒక బాబు ఇంకో బాబు చేత దణ్ణం పెట్టిస్తున్నాడు. ఆ దృశ్యం చూడముచ్చటగా అనిపించింది నీలిమకి. తర్వాత ఇద్దరూ కలిసి ఇవతలికి వచ్చారు. కానీ ఒకరి చేతిలో మరొకరి చేయి. బహుశా ఎనిమిది, తొమ్మిది సంవత్సరాలు ఉంటాయేమో.

"బాలూ! జాగ్రత్త" అంటూ నెమ్మదిగా నడుస్తున్న ఆ పిల్లలని అప్పుడు గమనించింది నీలిమ. వారిలో ఒకరికి చూపు లేదు. మరొకరికి కాలు అవిటి. అప్రయత్నంగా వెనుకకి అడుగు వేసింది నీలిమ.

"నీలూ! ఇలా రా!" భుజం మీద శ్యామ్ స్పర్శతో వెనక్కి తిరిగింది నీలిమ.

"అరె, నీలూ! ఏమయింది!" ఆమె కళ్లల్లోని తడి చూసి కంగారుగా అడిగాడు శ్యామ్.

"ఏం లేదు రండి వెళ్దాం" ఎదురుగా వస్తున్న అమ్మావాళ్లని చూస్తూ ముందుకి నడిచింది నీలిమ.

శ్యామ్ అప్పుడు చూశాడు వెనుక వస్తున్న పిల్లలని. విషయం అర్థమయింది.

అందరూ గుడిలో వినాయకుడికి దణ్ణం పెట్టుకున్నారు. శ్యామ్ అన్నాడు. "నీలూ! ఈ రోజు ఈ పిల్లలందరికీ నా చేత్తో ఆకలి తీర్చాలనుకుంటున్నాను. ప్రేమని కేవలం ధనంతోనే కాక మనసుతో అందించాలని పంచాలని నా ప్రయత్నం. తాపత్రయం. నీ నుంచి మనస్ఫూర్తిగా సహకారం, అంగీకారం ఉంటుందనే నమ్మకంతోనే నీకు చెప్పకుండా ఏర్పాటు చేశాను. నీకు.." చిన్నగా అంటూ మధ్యలో ఆపిన అతని మాటలకి నవ్వింది నీలిమ అంతా అర్థమయినట్లుగా. నీలూ ఏదో అనబోయేలోపే అన్నపూర్ణ అంది.

"బాబూ! చిన్నపిల్లలు ఆలస్యమైతే ఆకలికి ఆగలేరు. వెళ్దాం రండి" అని.

అక్కడే కొద్దిగా ముందుకి వెళితే ఎడమ పక్కగా హాలు. బయట అంతటా కూడా ఫ్లోరింగ్ చేసి శుభ్రంగా ఉంది. ఆ పరిశుభ్రత చాలా నచ్చింది అందరికీ.

"నీలూ! నేను ఒకసారి ఆఫీసులో కలిసి వస్తాను" మేఘనని నీలిమ చేతికిచ్చి ఆఫీసులోకి వెళ్లాడు శ్యామ్.

తల్లితో బాటు హాలులో అడుగుపెట్టింది నీలిమ. వెనుకే తండ్రి, బాబాయి.

హాలు విశాలంగా ఉంది. చక్కటి వెంటిలేషన్. ఏదో చేశాం. కట్టించాం అన్న పద్ధతిలో కాకుండా ఇంత స్పెషియస్‌గా ఏర్పాటు చేసిన దాతలకి మనసులోనే నమస్కరించింది నీలిమ.

"నీలూ! మేఘనని అమ్మకిచ్చి నువ్వు ఇలా రా" వెనుక నుంచి వినిపించిన శ్యామ్ మాటలకి పాపని అమ్మకిచ్చి అతని వెంట నడిచింది నీలిమ.

అప్పటికే పిల్లలందరూ వరుసగా కూర్చున్నారు. అందరూ శుభ్రంగా, నీట్‌గా కనిపించారు. వడ్డనకి మనుషులున్నా శ్యామ్ చేతిలో కూర గిన్నె. పదార్థాలు చాలా సింపుల్‌గా ఉన్నాయి.

పప్పు, కూర, సాంబారు, స్వీట్ ప్రత్యేకమైన రోజులలో స్వీట్ చేస్తారుట. పిల్లలు ఒకరికొకరు సాయం చేసు

# కొత్త సోనమ్

**అనిల్ కపూర్ కూతురు సోనమ్ కపూర్ గత ఏడాది రెండు చిత్రాల్లో నటించినా అవి పరాజయం చవిచూసాయి. దీంతో ఈ 2010లో తనంటే ఏంటో నిరూపించుకుంటాననంటోంది. ఈ ఏడాది తీసుకునే ఏ నిర్ణయమైనా తన సొంత ఆలోచనతోనే వుంటాయని ఘంటాపథంగా చెబుతోంది. అంటే తండ్రి సలహా, సంప్రదింపులతో సంబంధం లేకుండా ఒక్కర్తే తన కెరీర్‌ని రూపొందించుకుంటానంటోంది. 2010 కచ్చితంగా తన సత్తాని నిరూపించుకునే సంవత్సరంగా నిలుస్తుందని నమ్మకంగా వుందంటోంది ఈ 24 ఏళ్ల అందాల భామ.**



కుంటూ తినటం చాలా నచ్చింది నీలిమకి. శ్యామ్ పిల్లల పేర్లు అడిగి పలుకరిస్తూ కొసరి వడ్డించడం చూస్తే అతనిలో మరో కోణం చూస్తున్న భావం కలిగింది నీలిమకి. అతనితో పాటు అన్నీ దగ్గరుండి చూసుకోవడం తృప్తిగా కూడా అనిపించింది.

ఇరవై నిమిషాల్లో పిల్లల భోజనాలు ముగిశాయి. తర్వాత అక్కడ స్టాఫ్‌తో బాటు శ్యామ్, నీలిమ, తల్లి, తండ్రి, బాబాయ్ అందరూ అక్కడే భోజనం చేశారు. మేఘనకి కూడా ముందు కొద్దిగా స్వీట్ తినిపించింది. తర్వాత అన్నం పెట్టింది నీలిమ.

నీలిమ తల్లి, తండ్రి కళ్లల్లో ఓ విధమైన తృప్తిని గమనించింది. బాబాయ్‌కి శ్యామ్ మనస్తత్వం కొత్తేమీ కాదు కనుక ఎప్పటిలానే ఆనందం.

నీలిమకి అనిపించింది ఇవ్వడంలో ఆనందం, తృప్తి ప్రతీసారీ ప్రత్యేకమే అని.

* * *

పిల్లలందరూ వారి వారి గదుల్లోకి వెళ్లిపోయారు. శ్యామ్ వచ్చేముందు ఆఫీసులో మాట్లాడి వచ్చి నీలిమని తీసుకుని పిల్లలకి మేఘనతో బై చెప్పించాడు. పిల్లల కళ్లల్లో చెప్పలేని ఆనందం చూశాక అనిపించింది నీలిమకి. చిన్నమాట, గుర్తింపు మనసుని ఎంత సేదతీరుస్తుంది అని.

శ్యామ్‌ని కారు వరకూ వచ్చి సాగనంపాడు మేనేజర్.

* * *

కారులో అమ్మావాళ్లని వాళ్ల ఇంటిదగ్గర దింపి వెనుదిరిగారు శ్యామ్, నీలిమ. ఇంటికి రమ్మంటే రాలేమన్నారు ముగ్గురూ. అప్పటికే అలిసిపోయి ఉండటంతో.

వచ్చేముందు నాన్న అన్న మాటలు తలుచుకుంటోంది నీలిమ. "నీలూ! చాలా తృప్తిగా ఉంది తల్లీ! అల్లుడిని కొత్తగా చూశాను ఈ రోజు." ఆయన కళ్లల్లో చెప్పలేని ఆనందం. ఇంచుమించు అమ్మది అదే భావం. నీలిమ మరచిపోలేని అనుభూతి అది.

కారులో డ్రైవింగ్‌లో శ్యామ్. పక్కనే నీలిమ వళ్లో పాపతో. పట్టుపరికిణీతో బుట్టబొమ్మలా మెరిసిపోతోంది మేఘన. చాయ తక్కువన్నమాటే కానీ కనుముక్కుతీరు దిద్దినట్టుగా ఉంటాయి మేఘనకి శ్యామ్ లాగానే.


"నీలూ! మౌనంగా ఉన్నావేం" అతని ప్రశ్నతో ఆలోచనలో ఉన్న నీలిమ తిరిగి చూసింది. అమూల్యమైన తృప్తి. మనసు నిండిన ఆనందంతో మాటలు రావటం లేదు నీలిమకి. మౌనాన్ని మించిన భాష, ఆనందం మరొకటి లేదేమో అనిపించింది ఆ క్షణంలో నీలిమకి.

అతని ప్రశ్నకి సమాధానంగా మాటలు కూడదీసుకునేలోపే అతనే అన్నాడు. "వికలాంగుల కోసం, వారి ఆనందం కోసం ఇలా చేసే వ్యక్తి, పుట్టబోయే పిల్లలు కేవలం నలుపు అవుతారని భయపడటం ఏమిటి అనుకుంటున్నావా! నీలూ! మనిషి చాలా చిత్రమైనవాడు. మంచి-చెడు. నిజం-అబద్ధం. ఏది సరియైనది. ఏది కాదు. అన్నీ తెలుసు. తెలిసినా కొన్ని సమయాలలో చాలా మామూలుగా ఆలోచిస్తాడు. ప్రవర్తిస్తాడు. బహుశా దీనినే మానవ నైజం అంటారేమో! అంతవరకు ఎందుకు! చిన్నప్పుడు అమ్మ నన్ను సరిగా చూడలేదనే కారణం, పిల్లలు వద్దని చెప్పినా నువ్వు వినలేదనే సాకు. వీటినే నేను ఇప్పుడు మేఘన మీదా, నీ మీదా చూపిస్తుంటాను అప్పుడప్పుడు. అఫ్‌కోర్స్. అవి చిన్న విషయాలే కావొచ్చు. అయినా మనం చేసేది సరియైనది కాదు అని తెలిసినా చేస్తాము. తెలిసే చేస్తాము. ఒక్కోసారి అనిపిస్తుంది అలా చేయటమే బెటరేమో! ఎవరూ చెప్పకుండా ఎదుటివారి మౌనం, ఒక్కోసారి తిట్లు మనల్ని మనం ఆత్మవిమర్శ చేసుకునేలా చేసి సరిదిద్దుతుందేమో! అని.

ఇలా అనుకోవటం ఆత్మవంచన అంటావా! ఏదేమయినా తప్పు అని మనకి తెలిస్తే చాలు సరిదిద్దుకునే మార్గాలు వేయి. ఏమంటావ్.

"నీలూ. ఇంకోమాట కూడా నీకు ఆశ్చర్యం కలిగిద్దామనే ఈ రోజు ప్రోగ్రామ్ నీకు చెప్పలేదు. అంతేకాదు ఇకనుంచి మనం అప్పుడప్పుడు ఈ సంస్థకి వచ్చి కనీసం నెలకొక్కసారయినా ఆ పిల్లలతో గడపాలని నా ఆశ. చిన్నప్పుడు కేవలం రంగు విషయంలోనే అమ్మతో నేను పడిన అసంతృప్తి, బాధ ఈ పిల్లలు వారి విషయంలో పడకూడదని నా తాపత్రయం, ఆలోచన. అందుకే ఈ నిర్ణయం. నీ మనఃపూర్వక సమ్మతి, సహకారం నాకుంటాయనే నా నమ్మకం. ఏమంటావ్ నీలూ! మాట్లాడు. ప్లీజ్" అతని గొంతులో మార్దవం నీలూని మాట్లాడనీయటం లేదు. ఏం మాట్లాడాలో తోచటం లేదు. అతనిలో మరో కోణం ప్రస్ఫుటంగా కనిపిస్తుంటే మూగగా ఆరాధించాలనిపిస్తోంది. మౌనంగా చూడాలనిపిస్తోంది. అందుకే మాటలు రాని దానిలా అతనికి దగ్గరగా జరిగి భుజం మీద తల ఆన్చి కళ్లు మూసుకుంటూ అంది. "నేను చాలా దురదృష్టవంతురాలినని... ఇన్నేళ్లు నిన్ను మిస్ అయినందుకు. ఇప్పుడు ఇక ముందు జీవితమంతా నీతో నీతో నిండిపోతున్నందుకు అదృష్టవంతురాలిని. ఇంకేమనను చెప్పు" ఏకవచనం చేస్తున్నానని తెలిసి తెలీని పరిస్థితిలో తగ్గు స్వరంతో అంది నీలిమ. ఆ గొంతులోని ప్రేమ, లాలన అతని మనసుకి కొత్తగా ఊపిరి పోస్తున్న అనుభూతి చెందుతూ ఎడమచేత్తో ఆమెని మరింత దగ్గరికి తీసుకున్నాడు శ్యామ్.

కారు నిదానంగా సాగిపోతోంది అమూల్యమైన తృప్తి, పరిపూర్ణత నిండిన వారి మనసుల్లాగానే.



## ఐష్ అందానికి దీటుగా...

నిన్న డిసెంబర్ 12కి తన 60వ ఏట అడుగుపెట్టిన రజనీకాంత్ మేకప్వేస్తే పదహారేళ్ల కుర్రాడైపోతాడని మరోసారి నిరూపించుకోబోతున్నాడు 'రోబో' సినిమాలో. తాజాగా 'రోబో' స్టిల్స్ ఎలాగో బయటికొచ్చేసాయి. వాటిని చూసినవాళ్లంతా రజనీ గ్లామర్‌కి ఆశ్చర్యపోతున్నారు. వయసు మీద పడినా కెమెరా ముందుకొచ్చేసరికి మాత్రం ఇంత యంగ్‌గా తయారైపోవడం వల్లనేమో అభిమానులు అంతగా అతనిపై తమ క్రేజీని పెంచుకుంటారు! మాజీ మిస్ వరల్డ్ ఐశ్వర్యారాయ్ అందానికి దీటుగా ఈ సినిమాలో రజనీ కనిపించబోతున్నట్టే వుంది.